షెర్లక్ హోమ్స్ పరిశోధన

# ద సైన్ ఆఫ్ ఫోర్

సర్ ఆర్తర్ కానన్ డాయల్




అనువాదం : కె.బి.గోపాలం



# ద సైన్ ఆఫ్ ఫోర్

రచన

సర్ ఆర్తర్ కానన్ డాయ్ల్

కె.బి.గోపాలం

క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్

హైదరాబాద్

# ద సైన్ ఆఫ్ ఫోర్

## ద సైన్స్ ఆఫ్ డిడక్షన్



షెర్లక్ హెూమ్స్ మాంటిల్‌పీస్ మీదనుంచి తన బాటిల్ తీసుకున్నాడు. మోరోకో కేసులో నుంచి సిరింజ్ తీసుకున్నాడు. తన సన్నని పొడుగాటి తెల్లనివేళ్ల సాయంతో సున్నితంగా సూదిని అమర్చాడు. ఎడమచేతి చొక్కాను సర్దుకున్నాడు. ఒక క్షణంపాటు అతని దృష్టి తన ముంజెయ్యి, మణికట్లమీద నిలిచింది. అక్కడ లెక్కలేనన్ని చుక్కలు సూదులు గుచ్చిన సాక్ష్యంగా కని పించాయి. చివరికి అతను సూదిని గుచ్చుకున్నాడు. చిన్న పిస్టన్‌ని నొక్కి

ద్రవాన్ని ఒంట్లోకి పంపించుకున్నాడు. ఇక తాపీగా వెల్వెట్ కుట్టిన కుర్చీలోకి జేరబడి సంతృప్తిగా నిట్టూర్చాడు.

కొన్ని నెలలుగా రోజుకి మూడుసార్లుగా జరుగుతున్న ఈ తంతును నేను చూస్తూనే ఉన్నాను. అయినా సంగతి నాకు మనసుకు నచ్చలేదు. పైగా, దినదినమూ నాకది నచ్చని దృశ్యంగా మారుతున్నది. నేను ధైర్యం చేసి నిరసన తెలుపలేకపోతున్నానన్న సంగతి నాకు ప్రతి నిత్యమూ మనసులో మెదలాడుతున్నది. మళ్లీమళ్లీ ఈ సంగతి గురించి నా మనసు విప్పి చెప్పాలని నిశ్చయం చేసుకుంటూనే ఉన్నాను. కానీ మిత్రుని నిర్లక్ష్య ధోరణి, అతని వద్ద ఎవరూ స్వతంత్రం తీసుకోలేని ఒక విచిత్రమైన వ్యక్తిత్వమూ కలిసి నన్ను ఆపుతున్నాయి. అతను గొప్ప శక్తిగలవాడు. హుందాగా ఉంటాడు. అతని గొప్ప లక్షణాలను గురించి చెప్పడానికి నాకెన్నో అనుభవాలున్నాయి. వీటన్నిటి దృష్ట్యా నేను ముందుకు కదల లేకపోతున్నాను.

ఆ మధ్యాహ్నం మాత్రం, నేను భోజనంతో పుచ్చుకున్న బ్యూన్ ప్రభావమో లేక అతని ప్రవర్తన పట్ల కలిగిన తీవ్రమయిన అసంతృప్తివల్లనో, ఒక్కసారిగా ఇక ఓపిక పట్టలేనని అనిపించింది.

“ఏం పుచ్చుకున్నావు ఇవాళ, మార్ఫీనా, కొకెయినా?” అడిగాను.

అతను కళ్లను బరువుగా ఎత్తాడు. చేతిలోని పుస్తకంలోనుంచి తల ఎత్తి నా వైపు చూశాడు.

“ఇవాళ కొకెయిన్ ఏడు శాతం ద్రవం. నీవు కొంచెం పుచ్చు కుంటావా?” అన్నాడతను.

“వద్దుబాబూ, వద్దు. అఫ్ఘాన్ యుద్ధం ప్రభావం నా శరీరం మీద ఇంకా పనిచేస్తున్నది. దానిమీద ఇంకా ఎక్కువ బరువు వేయడం నావల్ల కాదు.” వెంటనే జవాబు చెప్పాను.

నా తీరు చూచి అతను నవ్వాడు. “వాట్సన్, నీవంటున్నది బహుశా

నిజం. శరీరంమీద దీని ప్రభావం చెడ్డదనే అనుకుంటున్నాను. కానీ నాకు మాత్రం దీనివల్ల చెప్పలేని చురుకుతనం వస్తుంది. మెదడు శుభ్రం అవుతుంది. కనుక తర్వాతి ప్రభావాల గురించి నాకు పట్టదు" అన్నాడు అతను.

"కానీ ఒకటి గమనించు. ఏం జరుగుతుందో ఆలోచించు. నీవు అంటున్నట్టే మెదడుకు అది బాగుండవచ్చు. కానీ దీని పర్యవసానాలు చాలా బలమైనవి. శరీరంలోని భాగాలన్నీ బాగా బలహీనపడి పోతాయి. నీకు తెలియదని కాదు. కానీ నీకది పట్టదు. అయినా కొద్దిపాటి ఆనందం కోసం నీకు ఉన్న గొప్ప శక్తులను పణం పెట్టడం మంచిది కాదేమో? నేను కేవలం ఒక మిత్రుడిగా మాట్లాడడంలేదు  ఒక వైద్యుడిగా కూడా చెబుతున్నాను. నా మిత్రుని ఒంట్లో బాగోలేదంటే బాధ్యత నాదే కదా?" అన్నాను.

అతనేమీ బాధపడినట్టు కనిపించలేదు. పైగా, తన మామూలు ధోరణిలో రెండు చేతుల వేళ్ళ చివర్లను ఒకచోటికి చేర్చి మోచేతులను కుర్చీ చెక్కల మీద ఆనించి, కుతూహలంగా వింటున్నట్టు నా వైపు చూడసాగాడు.

"ఊరికే కూచుంటే నా మనసు తిరగబడుతుంది. ఒక సమస్యను ఇవ్వు, కాస్త పని ఇవ్వు, విడదీయరాని చిక్కు సమస్యను ఏదయినా ముందుకు తీసుకురా, తీవ్రమైన విశ్లేషణలు చెయ్యమను, అప్పుడు నేను మామూలు మనిషిని అవుతాను. నాకిక ఈ కృత్రిమమయిన ప్రేరణలు పట్టవు. అంతేగాని, ఊరికే కూచోమంటే మాత్రం నేను పిచ్చెత్తిపోతాను. అందుకే మరి ఈ వృత్తిని చేతికి తీసుకున్నాను. తీసుకోవడం కాదు, నేనే దాన్ని సృష్టించాను. ప్రపంచంలో నావంటివాళ్లు మరొకరు లేరు." అన్నాడతను.

"అనఫీషియల్ డిటెక్టివ్‌లు మరెవ్వరూ లేరా?" కనుబొమలు ఎగరేస్తూ అడిగాను.

"అటువంటి డిటెక్టివ్‌ని నేను ఒక్కణ్ణే. నేరపరిశోధన రంగంలో నన్ను మించిన పెద్ద కోర్టు లేనే లేదు. గ్రేగ్‌సన్, లెస్ట్రేడ్‌కానీ ఎథెల్నీ జోన్స్‌కానీ ఒక వ్యవహారంలో లోతుని అందుకోలేని పక్షంలో, నిజం చెప్పాలంటే వాళ్లు సాధారణంగా  అందుకోలేరు, వ్యవహారం నాముందుకు వస్తుంది.  నేను సమాచారాన్నంతా పరిశీలించి, ఒక నిపుణుడుగా నా అభిప్రాయాలను అందజేస్తాను. అందుకు నాకు ఏ రకంగానూ లాభం ఉండదు. ఏ పత్రికలోనూ నా పేరు కనిపించదు. ఆ పనే నాకు ఆనందాన్నిస్తుంది. నేను ఎంచుకున్న రంగంలో నాకు అదే బహుమతి. జెఫర్సన హోప్ కేస్ వ్యవహారమంతా నీవు పక్కనే ఉండి చూచావు గదా" అతను జవాబిచ్చాడు.

"అవును. నా జీవితంలో అంతటి ఆశ్చర్యం మరెన్నడూ కలిగి ఉండలేదు. ఆ వివరాలన్నీ ఒక చిన్న రచనగా రాసిపెట్టాను దానికి 'ఏ స్టడీ ఇన్ స్కార్లెట్' అనే అందమయిన పేరు కూడా పెట్టాను." గౌరవంగా అన్నాను.

అతను కాస్త బరువుగా తల ఆడించాడు.

"చూచాను. నిజం చెప్పాలంటే దాన్ని గురించి నిన్ను అభినందించాలని నాకనిపించలేదు. నేరపరిశోధన అంటే అది అసలయిన సైన్స్. దానిని మరి ఆ పద్ధతిగానే భావావేశాలేవీ లేకుండా చెప్పాలి. నీవేమో దాన్ని కొంచెం రొమాంటిక్‌గా చెప్పావు. యూక్లిడ్ గణితం చెబుతూ అందులో ఏదో ప్రేమ కథ చొప్పించినట్టు ఉంది మరి." అతను అన్నాడు.

"అక్కడ ప్రేమ ఉంది మరి. నిజాలను కప్పి పుచ్చడం నాకు చేతగాలేదు." నేను ఎదురు చెప్పాను.

"కొన్ని నిజాలను అణచి పెట్టాలి. కాదంటే వాటిని చేతనయినంత వరకూ తగ్గించాలి. కేసులో ముఖ్యంగా చెప్పవలసిన ఒకే విషయం, దాన్ని మనం విశ్లేషించి, కార్యకారణాలను చూచి ఎట్లా ఫలితాలను రాబట్ట గలిగామన్నదే"

నేను నా మిత్రుడిని సంతోషపెట్టాలని ఆ రచన ఏదో చేశాను. దాన్ని అతనే విమర్శిస్తుంటే నాకు కొంచెం కోపం వచ్చింది. అతను తన గురించి తనపని గురించి మరీ అంత గొప్పగా చెప్పుకోవడం నాకు నచ్చలేదని ఒప్పుకుంటున్నాను. నేను రాసినదంతా అతని పనితనం గురించే. అయినా అతను నచ్చదంటాడు. ఇంతకాలంగా బేకర్‌స్ట్రీట్‌లో అతనితో కలిసి బతుకుతున్నాను గదా, నాకు ఒకటి రెండుసార్లు నా మిత్రుని తీరుపట్ల గట్టి అసంతృప్తి తోచింది. ఇప్పుడు కూడా నేను ఏమీ అనకుండా, నొప్పిపెడుతున్న నా కాలిని గమనిస్తూ ఉండిపోయాను. వెనకట ఎప్పుడో కాలికి ఒక బులెట్ తగిలింది. అది నన్ను కుంటివాణ్ణి చేయలేదుగానీ, వాతావరణం మారి నప్పుడల్లా కొంచెం సలుపుడు మాత్రం ఉంటుంది.

"నా ప్రాక్టీస్ ఖండాంతరాలకు కూడా పాకుతున్నది" కొంచెం ఆగిన తరువాత తన బ్రయర్ రూట్ పైప్‌ని నింపుకుంటూ హొమ్స్ అన్నాడు.

"గడిచిన వారంలో ఫ్రాన్స్‌వా లీ విలార్డ్ నాకు కబురుపెట్టాడు. అతను ఫ్రెంచ్ డిటెక్టివ్ సర్వీసులో మంచి పేరుపొందినవాడని నీకు తెలిసే ఉంటుంది. అతనికి సెల్టిక్ వారికి అందరికిలాగానే మంచి ఇంట్యూషన్ ఉంది. అయితే విషయం గురించి విస్తృతమైన తెలివిడి మాత్రం లేదు. అది ఉంటే అతని కళ మరింత మెరుగవుతుంది. కేసు ఒక వీలునామాకు సంబంధించినది. కొంచెం విచిత్రంగానే ఉంది. అతనికి అలాంటివే మరి రెండు కేసులను చూపించ గలిగాను. ఒకటి 1857లో రీగాలో, మరొకటి 1871లో సెయింట్ లూయిలోనూ జరిగినవి. వాటి సాయంతో ఇప్పటి కేసుకు సమాధానం చెప్పగలిగాను. నా సాయానికి ధన్యవాదాలు చెబుతూ అతను పంపిన ఉత్తరం ఈ ఉదయాన్నే వచ్చింది ఇదుగో."

మాట్లాడుతూ, అతను ఒక నలిగిన విదేశీ కాగితాన్ని నా వైపు విసిరాడు. నేను దాన్ని పరిశీలనగా చూచాను. అందులో పొగడ్తలుగా వినిపించే గొప్ప ఫ్రెంచ్ మాటలు నాలుగయిదు బలంగా కనిపించాయి.

"ఒక విద్యార్థి తన గురువుగారికి రాసినట్లుంది." అన్నాను.

"అతను నా సాయాన్ని చాలా గొప్పదిగా అనుకుంటున్నాడు. నిజానికి అతను గొప్ప తెలివిగలవాడే. నిజమయిన డిటెక్టివ్‌కి ఉండవలసిన లక్షణాలలో మూడింట రెండు వంతులు అతనికి ఉన్నాయి. మంచి పరిశీలన ఉంది. అందులో నుంచి ముందుకు సాగగల ఊహాశక్తీ ఉంది. లేనిదల్లా విస్తృతమయిన విషయపరిజ్ఞానం మాత్రమే. అది అనుభవం మీద వస్తుందేమో. ఇప్పుడతను నా రచనలన్నింటినీ ఫ్రెంచ్‌లోకి మారుస్తున్నాడు."

"నీ రచనలా?"

"ఏమిటి, నీకు తెలియనే తెలియదా?" గట్టిగా నవ్వుతూ అడిగాడు అతను. "చాలా రచనలు చేసిన దోషం నా మీద ఉందిలే. అయితే అవన్నీ సాంకేతికమైన సంగతులు. ఉదాహరణకు అందులో ఒకటి 'వివిధరకాల పొగాకు బూడిద గురించి వాటిలోని తేడాలను గురించి' అని ఉంది. ఇందులో నేను నూటనలభయి రకాల చుట్టలు, సిగెరెట్లు, పైప్ పొగాకులకు సంబంధించిన బూడిద గురించి రాశాను. రంగు బొమ్మలతో సహా ఎంతో విశదంగా ఉందది. నేరపరిశోధనలో పొగాకు బూడిద ఎప్పుడూ కనపడుతూనే ఉంటుంది. గొప్ప క్లూగా దొరుకుతూ ఉంటుంది. హత్యచేసిన మనిషి భారతదేశపు లంక పొగాకు చుట్ట కాల్చాడు అన్న సంగతి తెలిస్తే వెతకవలసిన మనుషుల సంఖ్య బాగా తగ్గుతుంది. తిరుచ్చినాపల్లి పొగాకు నల్లబూడిదకు బర్డ్స్ ఐ తెల్లబూడిదకు మధ్య కాబేజీకి బంగాళాదుంపకు ఉన్నంత తేడా ఉంది.''

"చిన్న చిన్న విషయాల గురించి ఇంత లోతుగా చూడడం నీకే చేతనయింది." అన్నాను నేను.

"నాకు వాటి ప్రాముఖ్యం అర్థమవుతుంది. ఇదుగో అడుగుజాడలను గమనించడం గురించి నేను రాసిన మోనోగ్రాఫ్. ఆ పనిలో ప్లాస్టరాఫ్ పారిస్

అచ్చుల పాత్ర గురించి కూడా వివరించాను. దీనికీ, మేము చేస్తున్న పనికీ ఎంతో సంబంధం ఉంది. ఇక రకరకాల వృత్తులలో ఉన్నవారి చేతుల వివరాలను గురించి కూడా రాశాను. పలకలు కోసేవారు, నావికులు, కార్క్ పనివారు, కంపోజిటర్లు, నేతపనివారు, వజ్రాలు సానపట్టేవారూ ఇలా ఒక్కొక్కరి చేతులు ఒకలాగా ఉంటాయి. నేర పరిశోధనలో శాస్త్రీయంగా ముందుకు సాగాలంటే ఈ వివరాలు బాగా సాయం చేస్తాయి. ఎవ్వరూ గుర్తించని శవాల విషయంలోనూ, నేరస్తుల పూర్వజీవితం వివరాల్లోనూ ఈ ఆధారాలు బాగా పనికివస్తాయి. కానీ నా హాబీతో నీకు విసుగుగా ఉన్నట్టు ఉంది కదూ?"

"ఎంతమాత్రం లేదు. పైగా చాలా ఆసక్తికరంగా ఉంది. నీవు ఈ విషయాలను వాడుకోవడం నేను బాగా గమనించాను గదా. నీవు పరిశీలనను గురించి అందులోనుంచి వివరాలను బయటకు లాగడం గురించి మాట్లాడావు. ఈ రెంటి మధ్యన నాకు పెద్ద తేడా కనిపించడం లేదు." అన్నాను వినయంగా.

"అదెట్లాగా?, నీకు ఉదాహరణ చూపించాలంటే నీవీరోజు విగ్మోర్ స్ట్రీట్ పోస్టాఫీస్‌కు పొద్దున్నే వెళ్లావని చెప్పగలిగానంటే అది నా పరిశీలన వల్ల. ఇక అందులోనుంచి కొంచెం ముందుకు సాగి నీవు ఒక టెలిగ్రామ్ పంపించావని కూడా చెప్పగల్గుతున్నాను." అతని జవాబిచ్చాడు. కుర్చీలో వెనక్కు విలాసంగా చేరబడి పైపునుంచి నీలి పొగలను వదులుతున్నాడతను.

"భలే భలే. చక్కగా చెప్పావు. నీవు ఎలా చెప్పగలిగావన్నది మాత్రం నాకు అంతుపట్టలేదు. ఒప్పుకుంటున్నాను. అనుకోకుండా వెళ్ళివచ్చాను. ఆ సంగతి మరొకరితో చెప్పను కూడా చెప్పలేదు." అన్నాను.

"ఇందులో ఏముంది?" అన్నాడతను నా ఆశ్చర్యాన్ని చూచి నవ్వుతూ. "ఈ విషయం గురించి వివరణ ఇవ్వవలసిన అవసరమే లేదనుకుంటాను. అయినా ఇందులో కేవలం పరిశీలనకు, అందులోనుంచి ముందుకుసాగి

వివరాలను ఊహించానికీ మధ్య తేడా మాత్రం బాగా తెలుస్తుంది. పరిశీలన ప్రకారం నీ పంట్లాము మీద ఎర్రని మట్టి అంటి ఉండడం గమనించాను. విగ్మోర్ స్ట్రీట్ పోస్టాఫీస్ ముందు మట్టి తవ్వి పెట్టారు. అందులోనుంచి తప్పించుకు ముందుకు వెళ్ళడం అసలు వీలుకాదు. పైగా ఆ మట్టి విచిత్రమైన ఎరుపు రంగులో ఉంది. నాకు తెలిసి ఆ రకం మట్టి చుట్టుపక్కల మరెక్కడ లేదు. ఇక్కడి వరకూ పరిశీలన. మిగిలిందంతా విషయాన్ని ఊహాబలంతో ముందుకు లాగడం. ”

“టెలిగ్రామ్ సంగతి ఎలా తెలిసింది మరి?”

“ఏముంది? నీవు ఉత్తరం రాయలేదని నాకర్థమయింది. ఉదయం అంతా నా ముందే కూచుని ఉన్నావు. నీ బల్ల సొరుగులో తపాలా బిళ్ళలు ఉన్నాయి. పోస్ట్‌కార్డులు కూడా ఉన్నాయి. ఇక మరి టెలిగ్రామ్ పంపించడానికి కాక నీవు పోస్టాఫీసుకు మరి దేనికోసం వెళ్ళినట్టు? అనవసరమయిన విషయాలను పక్కనపెడితే నిజమేదో మిగిలిపోతుంది.”

“ఇప్పుడు నిజంగా అదే జరిగింది.” కొంచెం ఆలోచించి జవాబు ఇచ్చాను. “నిజంగానే విషయం చాలా సులువుగా ఉంది. నీ పద్ధతులను మరింత పరీక్షకు పెడతానంటే సందేహించవు గదా?”

“ఎంత మాత్రమూ లేదు. పైగా నీవు పెట్టే పని నాకు మరో డోస్ కొకెయిన్ అవసరం లేకుండా చేస్తుంది. నీవు నా ముందు పెట్టే ఏ సమస్యనయినా సంతోషంగా స్వీకరిస్తాను.”

“ఒక మనిషి ఒక వస్తువును నిత్యమూ వాడుతున్నాడంటే దానిమీద అతని గుర్తులు వదలకుండా ఉండడం ఎవరికయినా అసాధ్యమని నీవు అనడం విన్నాను. గట్టి పరిశీలకుడు వాటిని సులభంగా గుర్తిస్తాడని కూడా నీవే అన్నావు. ఈమధ్యనే నాకు అందిన ఒక గడియారం నాతో ఉంది. దీని స్వంతదారు అలవాట్లను గురించి దయచేసి చెపుతానంటే నేను సంతో షిస్తాను.”



నాకు ఒక రకంగా ఇలా పరీక్ష పెట్టడం సరదాగా ఉంది. అతనేమీ చెప్ప లేడని కూడా నా మనసులో ఉంది. ఈ రకంగా అతని స్వభావానికి ఒక చిన్న గుణపాఠం చెపుతానేమో అన్న ఆనందంతో గడియారాన్ని అతనికి అందించాను. అందుకుని దాన్ని అరచేతిలో పట్టుకుని కొంచెం తీక్షణంగా గమనించాడు. తరువాత దాని వెనక బ్యాక్ విప్పాడు. లోపలి భాగాలను ముందు మామూలుగానూ తరువాత ఒక భూతద్దంతోనూ పరిశీలించాడు. అతని ముఖంలోని భావాలను చూస్తూ ఉంటే నాకు చిరునవ్వు ఆగలేదు. చివరికి అతను కేసు మూసివేసి గడియారాన్ని తిరిగి నాకు అందించాడు.

“ఇందులో ఎక్కువ సమాచారం ఏమీ కనిపించలేదు. గడియారాన్ని ఈ మధ్యనే బాగా శుభ్రం చేశారు. దానితో నాకు తెలియవలసిన నిజాలు మాయమయి పోయినాయి.” అన్నాడు అతను.

“నిజమే చెప్పావు. గడియారాన్ని నాకు పంపించే ముందు శుభ్రం చేయించారు.” జవాబు ఇచ్చాను.

నా మిత్రుడు కుంటిసాకులు చెబుతున్నాడని తనకేమీ అర్థంగాకపోవడాన్ని కప్పి పుచ్చుకుంటున్నాడని మనసులోనే అనుకున్నాను. గడియారాన్ని శుభ్రం చేయకపోతే మాత్రం ఏమి సమాచారం దొరికి ఉండేది?

“సంతృప్తిగా లేదు నిజమే గానీ నా పరిశీలన మొత్తంగా పనికిరాకుండా ఏమీ పోలేదు. అసలు విషయం నీవే చెప్పాలి. నాకు అర్థమయినంత వరకూ

ఈ గడియారం మీ పెద్దన్న గారిది. ఆయనకు అది మీ నాన్నగారి నుంచి వచ్చింది." హెూమ్స్ కలలు కంటున్న పద్ధతిలో, మెరుపులేని కళ్లతో పై కప్పుకేసి చూస్తూ నిర్లిప్తంగా చెప్పాడు.

"నీవు చెప్పినదానిలో అనుమానం లేదు. గడియారం వెనుక ఎచ్. డబ్ల్యూ. అనే పొడి అక్షరాలు ఉండనే ఉన్నాయి మరి."

"నిజమే. డబ్ల్యూ అంటే నీ పేరే. కానీ గడియారం మీద తేదీ యాభయి సంవత్సరాల నాటిది. ఆ అక్షరాలు అప్పటివే. అంటే పై తరానికి సంబం ధించిన వ్యవహారం. ఇలాంటి వస్తువులు సాధారణంగా పెద్ద కొడుక్కు అందుతాయి. పెద్ద కొడుకు పేరు తండ్రిపేరులాగే ఉంటుంది. నాకు గుర్తు న్నంతవరకూ మీ నాన్నగారు పోయి చాలా సంవత్సరాలయింది. అంటే గడియారం మీ అన్నయ్య దగ్గర ఉండేదని అర్థం."

"ఇంతవరకూ నిజమే. ఇంకా ఏం చెబుతావు?" అన్నాను నేను.

"మీ అన్నయ్య అంత పరిశుభ్రమయిన అలవాట్లు లేని మనిషి. కొంచెం నిర్లక్ష్యం మనిషి కూడాను. అతనికి ఆస్తి బాగా దక్కింది. దాన్ని పోగొ ట్టుకున్నాడు. కొంతకాలం బీదవాడుగా బతికాడు. అప్పుడప్పుడు మాత్రం అతనికి బాగా డబ్బు అందుతూ ఉండేది. చివరికి అతను తాగుడుకు బానిస అయ్యాడు. తరువాత పోయాడు. ఇంతవరకూ నాకు అర్థమయింది."

నేను కుర్చీలోంచి చటుక్కున లేచాను. అసహనంతో గదిలో కుంటుతూ తిరగసాగాను. నా మనసులో ఒక రకమయిన చేదు భావం నిండింది.

"ఇది నీకు తగదు, హెూమ్స్. నీవు ఇంత దిగజారుతావని నేను అనుకోలేదు. దురదృష్టవంతుడు మా అన్నయ్యను గురించి నీవు కూపీలు తీసావు. ఇప్పుడేమో ఆ సంగతులన్నీ ఇప్పుడే తెలుసుకున్నట్లు తెలివిగా నటిస్తున్నావు. పాత గడియారాన్ని చూచి ఇన్ని సంగతులు గమనించావు అంటే నేను ఒప్పుకోలేను. నిజం చెప్పాలంటే ఇందులో నీ ధోరణి బాగా

బయటపడుతున్నది.”

“మైడియర్ డాక్టర్, నన్ను క్షమించు. నేను విషయాన్ని కేవలం ఒక సమస్యగా మాత్రమే చూచాను. అది నిన్ను బాధపెడుతుంది అన్న సంగతి నాకు తోచనే లేదు. కానీ ఒకటి నమ్ము. మీ అన్నగారి గురించి, ఈ గడియారం నా చేతికి అందేవరకూ ఒక ముక్క కూడా తెలియదు.”

“అయితే మరి ఇన్ని నిజాలు తెలుసుకున్నావంటే అది ఆశ్చర్యకరమైన విషయమే. నీవు చెప్పిన ఒక్కొక్క సంగతీ అక్షరాలా నిజం.”

“అది నా అదృష్టం. జరిగి ఉండవచ్చు అని తోచిన విషయాలను మాత్రమే చెప్పాను. అవన్నీ అంత నిజమవుతాయని నేను కూడా అనుకోలేదు.”

“నీవు అన్ని సంగతులు ఊహించిమాత్రం చెప్పలేదు కదా?”

“లేదు. నేను ఎప్పుడూ ఊహించను. అసలా పద్ధతి నాకు నచ్చదు. నిజంగా ఆలోచించేవారికి అసలు అది శత్రువవుతుంది. నీవు నా ఆలోచనా ధోరణిని అర్థంచేసుకోలేకపోతున్నావు గనుక అట్లాగనిపిస్తున్నది. చిన్న చిన్న విషయాలలో నుంచి పెద్ద సమాచారం బయటపడుతుందని నేను చెపుతూనే ఉంటాను. ఉదాహరణకు మీ అన్నగారు నిర్లక్ష్యం మనిషి అని నేను అన్నాను. గడియారం కేసు కింది భాగాన్ని పరిశీలిస్తే దానిమీద రెండు చోట్ల మాత్రమే నొక్కులు ఉన్నాయి. కానీ చాలా చోట్ల గీతలు పడి ఉన్నాయి. అంటే దాన్ని నాణాలు, తాళంచెవులు లాంటి గట్టి వస్తువులతో పాటు అదే జేబులో పెట్టుకున్నారని అర్థం. యాభయి గినీల గడియారాన్ని అంత అన్యాయంగా వాడుకున్నారంటే ఆ మనిషి స్వభావం గురించి ఊహించడం అంత గొప్ప కష్టమేమీ కాదు. అంత విలువగల గడియారం ఆస్తిలో భాగంగా అందిన మనిషికి ధనం కూడా బాగానే అంది ఉంటుందని ఊహించడమూ సులభమే.”

అతను చెప్పిన విషయాన్ని అవునంటున్నట్టు నేను తలాడించాను.

"వస్తువులను తాకట్టు పెట్టుకునేవారికి ఈ దేశంలో ఒక అలవాటు ఉంది. పద్దు తాలూకు నంబరును సూదిగా ఉండే ఒక వస్తువుతో తాకట్టు వస్తువు మీద గీతలుగా రాసుకుంటారు. గడియారం కేసు లోపల అటువంటి సంఖ్యలు ఉన్నాయి. లోపల గీసిన అంకెలు మాసిపోయే ప్రమాదం ఉండదు. బూతద్దం పెట్టి చూస్తే ఈ గడియారం కేసులో నాకు అటువంటి అంకెలు నాలుగు కనిపించాయి. అంటే ఏమిటి అర్థం? మీ అన్నయ్య తరుచూ డబ్బు కోసం కటకటపడేవాడని. ఇక మరో సంగతి. ఆయనకు అప్పుడప్పుడూ డబ్బు చేతికి అందుతూ వచ్చిందని, లేదంటే అన్నిసార్లు గడియారాన్ని విడిపించుకోవడం వీలయ్యేది కాదు. చివరకు నిన్ను ఒకమాట అడుగుతాను. గడియారం లోపల కీ ఇచ్చే రంధ్రం భాగాన్ని బాగా పరిశీలించు. వేలకొద్దీ గీతలు పడి ఉన్నాయి. అంటే కీ ఇవ్వబోయిన ప్రతిసారీ తాళం చెవి జారేదని అర్థం. మత్తులో లేని మనిషి చేతిలో అట్లా ఎందుకు జరుగుతుంది? ఇక తాగేవారి గడియారాలలో ఈ గీతలు ఉండడం చాలా మామూలు. రాత్రిపూట కీ ఇవ్వబోతారు, చెయ్యి జారుతుంది. గీతలు పడతాయి. ఇందులో రహస్యమేముంది?"

"మబ్బులు విడినంత క్లియర్‌గా ఉంది. నీ పట్ల నేను అన్యాయంగా మాట్లాడాను. నీకున్న అద్భుతమయిన మేధాశక్తి మీద నాకు మరింత గౌరవం ఉండాలి. ఇంతకూ ప్రస్తుతం చేతిలో పరిశోధించవలసిన కేసు ఏదీ లేదా?"

"లేదు. అందుకే కొకెయిన్. మెదడుకు పనిలేకపోతే నేను బతకలేను. ఇక దేనికోసం బతకాలి. కిటికీ దగ్గర నిలబడి చూడడానికా? ఈ నిరర్ధకమయిన ప్రపంచంలో ఏమి ఉంది గనుక? చూడు, వీధుల మీద పసుపు పొగమంచు ఎట్లా పరుచుకుంటున్నదో? ఆ ఇళ్లన్నీ ఎంత స్తబ్ధంగా ఉన్నాయో? ఇంతకంటే నిరాశకలిగించే దృశ్యం మరేమయినా ఉంటుందా? తెలివి ఉండి ఏమి లాభం డాక్టర్? దాన్ని వాడుకోవడానికి లేకపోయిన

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/The+Sign+Of+Four](http://kinige.com/book/The+Sign+Of+Four)**

* * *